సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 57 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం | 15.06.2025



# సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి

- 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, మన చౌరాస్తా :** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండిరగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్



రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫొటో విడుదల చేసిందని.. ఆ ఫొటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడు తున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యల పై సీఎం దృష్టిపెట్టాలని సూచించారు.

ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ.8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



# ఘనంగా శాంతి కళ్యాణం

నల్లగొండ, మన చౌరాస్తా : శంకర గోశాలలోని ప్రహల్లాద వరద లక్ష్మీనరసింహస్వామి వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో స్థాపిత దేవత పూజలు, శ్రీప్రహ్లాద వరద లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహా కుంభాభిషేకం, అలంకరణ, బలి ప్రధానం, పూర్ణాహుతి, కుంభోద్వాసన, కుంభ సంప్రోక్షణ అలంకరణ, మూల విగ్రహ, దివ్యదర్శనం, మంగళ హారతి, శాంతి కళ్యాణందా శీర్వచనములు, వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదావితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలోరాపోలు శ్రీనివాస్ భాస్కర్, గరాజు బి.శ్రీనివాసు, గిరి, ప్రవల్లిక, అర్చకులు ఫణీంద్ర శర్మ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.





# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా న్యాయ సేవధికారి సంస్థ చైర్‌పర్సన్ ప్రతిమ

**జనగామ, మన చౌరాస్తా :**

జిల్లా న్యాయ సేవధికారి సంస్థ చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొట్ట మొదటి కేసుగా ప్రధాన న్యాయమూర్తి బిఎస్ఎన్ఎల్ కేసులో కక్షిదారులకు అవార్డు అందజేశారు. లోకదాలతో 6 బెంచ్‌లను వేయగా మొదటి బెంచ్‌కు ప్రధాని న్యాయమూర్తి ప్రతిమ, మెంబర్ గా కే.చంద్రశేఖర్ అడ్వకేట్, రెండవ బెంచ్‌కు జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ విక్రమ్, మెంబర్ సిహెచ్ కిరణ్ కుమార్ అడ్వకేట్, మూడో బెంచ్‌కు




సుచరిత సీనియర్ సివిల్ జడ్జ్, మెంబర్ గా ఎన్ సంధ్యారాణి అడ్వకేట్, నాలుగో బెంచ్‌కు శశి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మెంబర్ గా ఎం స్వప్న అడ్వకేట్, ఐదో బెంచ్‌కు సందీప ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, మెంబర్‌గా రేఖ అడ్వకేట్, ఆరో బెంచ్‌కు వెంకట్రాం నరసయ్య స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ వ్యవహరించారు. మొత్తం సివిల్ కేసులు 82, మోటార్ యాక్సిడెంట్ 4 కేసులను పరిష్కరించారు. కార్యక్రమం న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ విక్రమ్ పాల్గొన్నారు.

# రెండు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉద్యోగం

పాలకుర్తి, మన చౌరాస్తా : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన చిలుకమారి రాజేష్ రెండు ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో ఉద్యోగం సాధించారు. యువకుడికి ఏకకాలంలో రెండు ప్రతిష్టాత్మక కొలువులు రావడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హర్యానాలోని నిట్ కురుక్షేత్ర, చెన్నైలోని కాంచీపురం ట్రిబుల్ ఐటీ డిజన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ లో (IIITDM)లో కంప్యూటర్ సైన్స్ (CSE) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం సాధించారు. చిలుకమారి రాజేష్ ఎంటెక్ విద్యను నిట్ సిక్కిం, నిట్ వరంగల్ లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పిహెచ్‌డి డాక్టరేట్ పట్టాను సాధించారు. రాజేష్ పిహెచ్‌డి పూర్తి చేశాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వీఐటీ అమరావతి లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తూనే నిట్ కురుక్షేత్ర, ట్రీపుల్ ఐటీ డీఎం కాంచీపురంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం సాధించారు. ఆయనను పలువురు అభినందించారు.





## హ్యాపీ ఫాదర్స్ డే

జీవితంలో ఎన్ని ఆటుపోట్లుఎదురైనా
ఎన్ని తుపానులు వచ్చిన రక్షణ కవచమై
నిలిచి ప్రేమను పంచుతు...
బతుకు అర్థం చెప్పిన భగవంతుడు నాన్న..!


గెలిచినప్పుడు పదిమందికి ఆనందంగా
చెప్పకునే వ్యక్తి, ఓడినప్పుడు భుజంపై
తట్టి గెలుస్తావులే అని దగ్గరకి
తీసుకుని హత్తుకునే వ్యక్తి నాన్న..!

ఓ ఆప్యా యత, ఓ భరోసా, ఓ త్యాగం
నాన్న..!
తొలి గురువు, స్నేహితుడు, మార్గదర్శి నాన్న..!
తానే బొమ్మయి ఆడించే వ్యక్తి నాన్న..!
సరైన మార్గంలో పయనింప చేస్తూ
గమ్యాన్ని పరిచయం చేసిన వ్యక్తి నాన్న..!

నాన్న నాతో లేకపోయినా ఆయన జ్ఞాపకాలను
మధురమైన స్మృతులుగా మలచుకున్న....
మీ ప్రేమ నా కలలకు ఇంధనంలా పనిచేస్తుంది
నాన్న మీకు నేను ఎప్పటికీ కృతజ్ఞురాలిని..
అందరికీ హ్యాపీ ఫాదర్స్ డే..



రచన : మంజుల పత్తిపాటి
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్.
యాదాద్రి భువనగిరి జిల్లా, సెల్ : 9347042218



# రక్త నిధికి సహకరించండి

జనగామ, మన చౌరాస్తా : ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి రక్త నిధికి సహకరించాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా ఆస్పత్రిలో ఎండీ జావీద్, ఎండీ ఆసిఫ్, ములకలపల్లి వికాస్, ఎండి అఫరఫ్, మిదపాక రాజు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ జిల్లా ఆసుపత్రిలో రక్త నిధి ఏర్పాటు లక్ష్యంగా ప్రతి ఒక్కరు అత్యవసర సమయాలలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. ఆపరేషన్ నిమిత్తం యాక్సిడెంట్ తదితర కారణాలతో వచ్చిన వారికి రక్తం దొరకడం లేదని, వరంగల్, హైదరాబాద్ మహానగరాలకు వెళ్లడం జరుగుతుందన్నారు. యువత దూరదృష్టం ఆలోచించి జనగామ జిల్లా ఆసుపత్రిలో రక్త నిధి ఏర్పాటు లక్ష్యంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి నల్ల వినోద్, జుబేర్, బండ్ల నవీన్, హాస్పటల్ సిబ్బంది రాజేష్, శ్రీరాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.








# ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

## ▪ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

**జనగామ, మన చౌరాస్తా :**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయ సమస్యల పట్ల అనుసరిస్తున్న ఉదాసీనత ఇప్పటికైనా విడనాడాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు.శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశానికి సంఘ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రవి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం అవుతున్నప్పటికీ విద్యా రంగంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, పాఠశాల విద్యారంగ సమస్యలు పేరుకొని పోతున్నాయని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో అనేక స్థాయిల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వందలాది ఎంఈఓల పోస్టులు, రెండు వందలకు పైగా ఉప విద్యాధికారి పోస్టులు, డైట్ కళాశాల అధ్యాపకుల పోస్టులు, బీఎడ్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించి ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలని, రెండున్నర ఏండ్ల నుండి వేతన సవరణ జాడే లేదని విమర్శించారు. ఊరు బడి నోరు నొక్కుతూ కార్యకర్తల కాంట్రాక్టుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళు, పబ్లిక్ స్కూళ్ళు తెరుస్తామని చెప్పడం శోచనీయం అన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించాలని కోరారు. గురుకుల కళాశాలల్లో ప్రతి విద్యార్థి మీద లక్ష రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల లోని విద్యార్థులకు మాత్రం అరకొర నిధులు ఇస్తూ వివక్ష చూపిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బాధ్యత మరింత పెరిగిందని, పాఠశాలలను, విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో ఉచిత విద్యుత్ సౌకర్యం, సర్వీస్ పర్సన్ నియామకం హర్షణీయం అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. ఇప్పటికీ చాలా పాఠశాలల్లో టాయిలెట్ల వసతి, మంచినీటి సరఫరా లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమావేశంలో రాష్ట్ర ఎఫ్‌డబ్ల్యూఎఫ్ డైరెక్టర్ ఆకుల శ్రీనివాస్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మదూరి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, జిల్లా కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ గూడెల్లి కృష్ణ, జిల్లా కార్యదర్శులు మెంతుల శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, తాల్లపెల్లి నీలకంఠం, కటకం సుధీర్ రెడ్డి, దేవీసింగ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి బీర్ల పరామర్శ

**అలేరు, మన చౌరాస్తా :** ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు చేసుకున్న గంధమల్ల రవి మృతి వార్త తెలుసుకుని విప్ బీర్ల ఐలయ్య దిగ్భ్రాంతికి గురయ్యారు. శనివారం రవి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రిలో సందర్శించి, విచారం వ్యక్తం చేశారు. ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. దుఃఖసాగరంలో మునిగిన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో మృతి చెందిన గంధమల్ల రవి అంశానికి రాజకీయ రంగులు అద్ది, ప్రతిపక్ష పార్టీలు మానవీయతకు సమాధి కట్టడం విచారకరం అన్నారు. మృతుడి సొంత కుటుంబ సభ్యులు అప్పుల బాధతో బలవన్మరణం చెందాడని చెబుతున్నా.. వాటిని పట్టించుకోకుండా ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తూ.. శవాల పైన పేలాలు ఏరుకునే నీచ సంస్కృతికి తెర తీయడం అత్యంత విషాదకరం అన్నారు. అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ ఇప్పటికే కాంగ్రెస్ నేతలు పోలీసు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం సైదాపూర్ గ్రామంలో గంధమల్ల రవి అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆయన సతీమణి బీర్ల అనిత పాల్గొన్నారు.



# రాజీ మార్గమే రాచమార్గం

## ▪ భూపాలపల్లి జిల్లా జడ్జి రమేశ్‌బాబు

**జయశంకర్ భూపాలపల్లి, మన చౌరాస్తా :** రాజీ మార్గాన్ని ఎంచుకొని వివాదాలు లేని జీవితాలను గడపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.హెచ్.రమేశ్ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాల్లో పంతాలకు పోయి గొడవలు పెట్టుకుంటే నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని రాజీ పడి కేసుల్లో నుండి బయటపడాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, డి.ఎస్.పి. సంపత్ రావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. ప్రియాంక, బెంచి మెంబర్లు సంగేమ్ రవీందర్ , ఎం.రజినీకాంత్ , రాజ్ కుమార్ పాల్గొన్నారు.



# కుబేర మూవీ టీజర్‌కు రంగం సిద్ధం

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర టీజర్ విడుదలకు రంగం సిద్ధం అయ్యింది. హైదరాబాద్ వేదికగా ఆదవారం ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చే వారం రిలీజ్ కాబోతున్న కుబేర సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడెప్పుడు సినిమా రిలీజవుతుందా అని ఉత్కంఠగా వేయిట్ చేస్తున్నారు.పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ , అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తుండగా. ఈ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే.. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను వాయిదా వేసిన విషయం తెలిసిందే. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరగడంతో ఈ వేడుకను వాయిదా వేసుకున్నారు. తాజాగా ఈ వేడుకకి సంబంధించి కొత్త డేట్‌ని ప్రకటించారు. కుబేరా ప్రీ రిలీజ్ వేడుకను జూన్ 15న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించ బోతున్నట్లు తెలిపారు. అలాగే ఈ మూవీ నుంచి రేపు -ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు- చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. ట్రైలర్ లాంచ్‌తో సినిమాపై మరింత హైప్ పెరిగేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.








క్రేజీ హీరోయిన్

## శ్రీలీల బర్త్ డే

రెండు సినిమాలకు
సంబంధించి పోస్టర్ల విడుదల

ప్రస్తుతం సౌత్ లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది శ్రీలీల. అనతి కాలంలోనే తన అందం, అభినయం, ఎనర్జీతో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ జూన్ 14 తన పుట్టినరోజును జరుపుకుంది. ఈ సందర్భంగా శ్రీలీలకు పలువురు విషెస్ చెప్పారు. ఆమె నటిస్తున్న రెండు భారీ ప్రాజెక్టుల నుంచి బ్యాక్ టూ బ్యాక్ స్పెషల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఇందులో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్‌లో ఆమె గ్లామర్‌తో పాటు డ్రస్సింగ్ స్టైల్ కూడా ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఇక అలాగే.. మరోవైపు మాస్ రాజా రవితేజ 'మాస్ జాతార' మూవీ నుంచి కూడా బర్త్‌డే స్పెషల్ పోస్టర్ విడుదలైంది. ఇందులో శ్రీలీల మరోసారి ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. ఈ సినిమాలో ఆమె పాత్ర కు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు బయటకు రాలేనప్పటికీ, పోస్టర్ చూస్తేనే ఆమె పాత్ర పట్ల ఆసక్తి పెరిగింది. ఇక ఈ రెండు పోస్టర్లు బర్త్‌డే సందర్భంగా విడుదల కావడంతో శ్రీ లీల అభిమానులు సోషల్ మీడియాలో భారీగా పోస్టులు షేర్ చేస్తున్నారు. కాగా శ్రీలీల కెరీర్‌లో చిత్రాలు మరో మైలురాయిగా నిలవనున్నాయి.